సీఎం వైఖరికి నిరసనగా అసెంబ్లీ హాలులో నిరసన తెలుపుతున్న కేటీఆర్, హరీశ్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వాహనాల్లో తరలిస్తున్న పోలీసులు. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజశేఖర్‌రెడ్డి, విజయుడు తదితరులు

లోకం పోకడ

వాన కాదు గురూ, వైన్!

నాలుగున్నర గంటలు నిల్చొనే నిరసన

- మైక్ కోసం మహిళా ఎమ్మెల్యేలు సబిత, సునీత, కోవ లక్ష్మి అభ్యర్థన
- ఎమ్మెల్యేలపై శాసనసభ చిన్నచూపు
- అధికార పార్టీ నేతల అవహేళనలు
- 'చీఫ్ మినిస్టర్ డౌన్ డౌన్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నినాదాలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిని ఎత్తుకొస్తున్న మార్షల్స్

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా, అగౌరవంగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేల నిరసనలతో అసెంబ్లీ హోరెత్తింది. నినాదాలు, నిరసనలతో మార్మోగింది. గురువారం అసెంబ్లీ ఉదయం 10.07 గంటలకు ప్రారంభం కాగా.. ఎమ్మెల్యే సబితపై సీఎం రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులంతా నల్లబ్యాడ్జీలు ధరించి సభకు హాజరయ్యారు. సీఎం రేవంత్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంలో సబితాఇంద్రారెడ్డికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని పదే పదే స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదు. తొలుత బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి తమ సీట్ల నుంచి లేచి పోడియం ముందుకు వెళ్లి నిరసన తెలిపారు. అయినా స్పీకర్ పట్టించుకోకపోవటంతో బీఆర్ఎస్ సహచర ఎమ్మెల్యేలు సైతం లేచి పోడియంలోకి వెళ్లారు. మహిళా ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఎదురుగా నిలబడి నిరసన తెలియజేయగా, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియం ఎదుటే బైఠాయించారు. సీఎం డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు. హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా సబితఇంద్రారెడ్డికి మైక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ సభనా, కౌరవ సభనా అని ప్రశ్నించారు. ఒక దశలో స్పీకర్‌కు హరీశ్‌రావు దండం పెట్టి మరీ మైక్ ఇవ్వాలని అభ్యర్థించారు. ఎస్సీ వర్గీకరణపై మాట్లాడితేనే మైక్ ఇస్తానని, సబిత అంశంపై మాట్లాడేందుకు మైక్ ఇచ్చేది లేదని స్పీకర్ స్పష్టంచేశారు. ఎస్సీ వర్గీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్‌కు మైక్ ఇస్తానని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వారి సీట్ల వద్దకు వెళ్లి కూర్చున్నారు. రాజనర్సింహ స్పీచ్ పూర్తయ్యాక బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వకుండా, కడియం శ్రీహరికి మైక్ ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు మళ్లీ వెల్‌లోకి దూసుకెళ్లారు. తర్వాత హరీశ్‌రావుకు అవకాశం ఇచ్చిన స్పీకర్.. అర్ధాంతరంగా మైక్ కట్ చేశారు. దీంతో మళ్లీ సభలో గందరగోళం నెలకొన్నది. ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సబిత, సునీత, కోవ లక్ష్మి సభలోనే నిల్చొని తమ నిరసన తెలిపారు.

నాలుగున్నర గంటలు నిల్చొనే నిరసన

క్లారిఫికేషన్ ఇచ్చుకొనేందుకు మైక్ ఇవ్వాలని స్పీకర్‌ను సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి కోరగా.. ఆయన పట్టించుకోలేదు. వరుసగా మంత్రులు మాట్లాడుతూనే ఉన్నారు.. విపక్ష సభ్యులు మాట్లాడుతూనే ఉన్నారు.. వాటికి సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం ఇస్తూనే ఉన్నారు. అయినా ఒక్కరంటే ఒక్కరు కూడా వారిని కూర్చోవాలని చెప్పే ప్రయత్నం చేయలేదు. వారు సభలోనే లేనట్టు ప్రవర్తించారు. నిరసన విషయం తెలంగాణ సమాజానికి తెలియనీయకుండా అసెంబ్లీ కెమెరా విభాగం జాగ్రత్త పడింది. అన్ని గంటల్లో వారివైపు కెమెరా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకొన్నది.

ప్రతిపక్ష డిమాండ్‌ను పట్టించుకోరా?: అక్బరుద్దీన్

ప్రధాన ప్రతిపక్షానికి మాట్లాడేందుకు అవకాశమైనా ఇవ్వాలి.. లేదా సస్పెండ్ అయినా చేయాలని స్పీకర్‌కు ఎంఐఎం ఎల్పీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ సూచించారు. సభలో ప్రధాన ప్రతిపక్షం నిరసన తెలుపుతూ నినాదాలు చేస్తుంటే సభ ఎలా ఆర్డర్‌లో ఉంటుందని, ఇలా సభను ఎలా నడుపుతారని, వారి సమస్యలను వినాలని, గంటలుగా నిరసన వ్యక్తం చేస్తున్నా సభను కొనసాగించటం సరికాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరి సరికాదని చెప్పారు.

పెడర్థాలు అవసరం లేదు: బీజేపీ ఎమ్మెల్యేలు

సబితాఇంద్రారెడ్డిపై సీఎం వ్యాఖ్యల్ని లోకమంతా ఖండిస్తుంటే బీజేపీ ఎమ్మెల్యేలు మాత్రం సమర్థించడం గమనార్హం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసనను బీజేపీపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్ వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నిరసనలతో తాము మాట్లాడే అవకాశం కోల్పోతున్నామన్నారు. 'సీఎం అక్కలు అని సంబోధించారు.. ఇందులో పెడర్థాలు తీసుకోవాల్సిన అవసరం లేదు. సీఎం ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదు. ఫ్లోలో అన్నదాన్ని రాజకీయం చేయొద్దు' అని వారు వ్యాఖ్యానించారు. దీంతో బీఆర్ఎస్‌సభ్యులు ఆగ్రహం తో 'బడే భాయ్.. చోటే భాయ్ ఏక్ హోగయా' అని నినాదాలు చేశారు.

కాంగ్రెస్ సభ్యుల అవహేళనలు

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు నిలుచొని నిరసన తెలుపుతుంటే కాంగ్రెస్ సభ్యుల అవహేళన చేశారు. జూనియర్ ఎమ్మెల్యేలు సైతం వారిపట్ల రన్నింగ్ కామెంట్రీ చేస్తూ ఆనందం పొందారు. కొందరు సభ్యులు వెనుక సీట్లలో కూర్చొని జోకులు వేసుకుంటూ నవ్వుతూనే ఉన్నారు. తొలి నుంచి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ నవ్వుతూనే ఉన్నారు. వీరికి మంత్రి పొన్నం ప్రభాకర్ తోడవటంతో సైగలు చేసుకుంటూ నవ్వుకున్నారు. నిలుచున్న మహిళా ఎమ్మెల్యేలు సీఎంకు ఎదురుగానే ఉన్నా కూర్చోవాలని చెప్పలేదు. పక్కనే ఉన్న మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు.

ఉద్యమ రోజులు గురుకొస్తున్నాయి: కూనంనేని

2009-2014 తెలంగాణ ఉద్యమ సమయంలో అసెంబ్లీలో జరిగిన సంఘటలను గుర్తుకొస్తున్నాయని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. గతంలో తెలంగాణ కోసం బీఆర్ఎస్ సభలో నిరసన తెలిపిందని, అనేక రోజులు సభ స్తంభించిందని వెల్లడించారు. తెలంగాణ కోసం అందరం మద్దతు తెలిపామని అన్నారు. ఇప్పుడూ అదే విధంగా నిరసనలు సాగుతున్నాయని చెప్పారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరెస్ట్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటికి వచ్చి సీఎం చాంబర్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి మాత్రం సభలోనే ఉండి నిల్చొని నిరసన తెలిపారు. ఉదయం సభ ప్రారంభమైన నాటి నుంచి మధ్యాహ్నం వరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకోవాలనే ఉద్దేశంతో మహిళా మార్షల్స్‌ను, బయట 30 మంది మహిళా కానిస్టేబుళ్లను సిద్ధంగా ఉంచారు. తర్వాత వారు సీఎం చాంబర్ ముందు నిరసన కొనసాగించారు. పోలీసులు వారిని కూడా అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో కోవ లక్ష్మి

కాంగ్రెస్‌ది రాక్షసానందం

- చట్టసభలోనూ వివక్షేనా?
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నిందలా?
- ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా?
- ఇటువంటి సీఎంను ఇప్పుడే చూస్తున్నాం
- సబితారెడ్డి, సునీతారెడ్డి, కోవ లక్ష్మి ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): తాము సభలో నాలుగున్నర గంటలు నిలబడితే సీఎం, అధికారపక్ష సభ్యులు రాక్షసానందం పొందారని, తమ ఇంటి ఆడబిడ్డలకు అలా జరిగితే అలాగే ప్రవర్తిస్తారా? అని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల సమాజం వివక్ష చూపుతున్నదనే వాదనకు రెండు రోజులుగా అసెంబ్లీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు బలాన్ని చేకూర్చాయని వారు ధ్వజమెత్తారు. ఇందిరమ్మ పాలన, సోనియాగాంధీ నాయకత్వం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. గురువారం తెలంగాణభవన్‌లో సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో తమకు జరిగిన అవమానం ఏ ఆడబిడ్డకూ రాకూడదని చెప్పారు. మహిళలపై లైంగికదాడులు పెరుగుతున్న విషయాన్ని సభ దృష్టికి తెస్తే సమాధానం చెప్పాల్సిందిపోయి తమను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని మండిపడ్డారు. అసెంబ్లీలో మహిళలకు మైక్ ఇవ్వడానికి సీఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ లాంటి మహామహులు కూర్చున్న స్థానంలో రేవంత్‌రెడ్డి కూర్చున్నారని, తాము నాలుగున్నర గంటలపాటు నిలబడి తమ హక్కు కోసం పోరాడితే సభలో ఏ ఒక్కరి మనసు చలించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు మాట్లాడే అవకాశం కల్పించకపోయినా కనీసం ఆదివాసీ ఆడబిడ్డ కోవ లక్ష్మికి కూడా అవకాశం ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. తమను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అయితదనే రీతిలో సీఎం వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. రేవంత్‌ను నమ్మిన రాహుల్ బతుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అవుతుందా? అని ప్రశ్నించారు. సబితక్కను నమ్ముకున్నందుకే రేవంత్ సీఎం అయ్యారనే విషయాన్ని విస్మరించొద్దని చెప్పారు.

భట్టి సీఎం పదవి కోసం కొట్లాడాల్సిందిపోయి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీఎం పదవికి కోసం కొట్లాడాల్సిందిపోయి నాడు ప్రతిపక్ష హోదా పోయిందనే వంకతో తన పట్ల అనుచితంగా మాట్లాడటం తనను మరింత వేదనకు గురిచేసిందని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. తమ ఖర్మ వల్ల రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఉన్నవాళ్లు ఎంతమంది పార్టీలు మారలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌తో గెలిచిన ఎమ్మెల్యేలను ఏ మొహం ఉన్నదని కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ప్రశ్నించారు. సభలో లేని వ్యక్తుల పేర్లను ప్రస్తావించకూడదనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మరచి ఎమ్మెల్సీ కవిత పేరును తేవడాన్ని తప్పుబట్టారు. లైంగికదాడులపై ప్రభుత్వం స్పందించేదాకా పోరాడుతా మని హెచ్చరించారు. సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పడం, చెప్పకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు.

కనీస అవగాహన లేని సీఎం : సునీతా లక్ష్మారెడ్డి

నాలుగున్నర గంటలు అసెంబ్లీలో తాము నిల్చున్నా పాలకపక్షం స్పందించక పోగా హేళన చేసిందని మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. సభలో తాము అంతసేపు నిలబడితే మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు తమపై వివక్ష చూపడం ఒక ఎత్తయితే, కొత్త ఎమ్మెల్యేల మాటలు, చేష్టలు మరింత వేదనకు గురిచేశాయని పేర్కొన్నారు. తన ప్రచారానికి రావడం వల్లే సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు లు నమోదయ్యాయని పేర్కొనడాన్ని తప్పుబట్టారు. నాడు రేవంత్‌రెడ్డి ప్రసంగాల వల్లే తన మీద కేసులు నమోదయ్యాయని వివరించారు. కేసుల కొట్టివేత, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి కోసం తాను బీఆర్ఎస్‌లో చేరానని రేవంత్‌రెడ్డి పేర్కొనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. తనపై నమోదైన కేసులు కొట్టివేయలేదని, నర్సాపూర్ నుంచి నాంపల్లి కోర్టుకు మారాయనే విషయాన్ని ఆయన విస్మరించారని పేర్కొన్నారు.

ఆదివాసీ బిడ్డగా మాట్లాడనివ్వరా?: కోవ లక్ష్మి

ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో తాను కూడా భాగస్వామ్యం అయ్యానని, సుప్రీంకోర్టు తీర్పుపై మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రశ్నించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని విమర్శించారు. సీఎం, డిప్యూటీ సీఎం కూడా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై చేసిన వాఖ్యలను ఉపసంహరించుకుంటారని భావించామని, వారు అందుకు విరుద్ధంగా కించపరిచారని పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ పార్టీ తమకు అండగా నిలిచిందని, అందుకు ముగ్గురూ ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, వివేకానంద, సంజయ్, రాజశేఖర్‌రెడ్డి

తాలిబన్ల వారసుడిలా రేవంత్‌రెడ్డి

- 2009లో బీఆర్ఎస్ పొత్తు వల్లే ఎమ్మెల్యేగా గెలిచారు
- సబితమ్మకు మైక్ ఇవ్వాలంటే అంత భయమెందుకు?
- ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- కేసీఆర్ కృషికి ఫలితం: వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): తాలిబన్ సంస్కృతికి వారసుడిలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డికి సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడానికి సర్కారుకు భయమెందుకు? అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కే సంజయ్, మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ వేదికగా రాష్ట్రంలో ఆడబిడ్డల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అమానుషంగా వ్యవహరించారని వేముల మండిపడ్డారు. అహంకారిగా, అపరిచితుడిగా, అజ్ఞాని, ఫ్యాక్షనిస్ట్, ఫ్యూడల్‌గా వ్యవహరిస్తున్నారని సీఎంపై విరుచుకుపడ్డారు. డీకే అరుణపై వాడిన పరుష పదజాలం నుంచి మొదలుకొని.. సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి దాకా మహిళలను అగౌరపరచిన చరిత్ర రేవంత్‌ది అని దుయ్యబట్టారు. సభలో మహిళా సభ్యులు నాలుగున్నర గంటలపాటు నిలబడే ఉన్నా మా ట్లాడే అవకాశం ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. రేవంత్‌రెడ్డికి కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కులేదని, కేసీఆర్ కాలి గోటికి రేవంత్ సరిపోరని పేర్కొన్నారు. 2009లో బీఆర్ఎస్‌తో టీడీపీ పొత్తుపెట్టుకోవటం వల్లే ఎమ్మెల్యే అయ్యారనే విషయాన్ని రేవంత్ గుర్తుంచుకోవాలని హితవు చెప్పారు.

అసెంబ్లీలో దుశ్శాసన పర్వం: జగదీశ్‌రెడ్డి

అసెంబ్లీలో దుశ్శాసనపర్వం నడుస్తున్నదని జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలంటే కనీస గౌరవం లేదని మరోసారి స్పష్టమైందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను సభలో ప్రస్తావించారన్న అక్కసుతో సబితాఇంద్రారెడ్డిపై సీఎం తన అక్కసును వెళ్లగక్కారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యల వల్లే బయట అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. సీఎం ఆగ్రహంతో మాట్లాడితే ఉపముఖ్యమంత్రి భట్టి పెద్దరికంగా వ్యవహరిస్తారని అనుకున్నా నిరాశే ఎదురైందని.. నిజానికి సీఎం మీద ఉన్న కోపాన్ని డిప్యూటీ సీఎం సబితాఇంద్రారెడ్డిపై ప్రదర్శించారని ఆరోపించారు.

వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన అమరులకు అంకితం

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి అసువులు బాసిన అమరులకు సుప్రీంకోర్టు తీర్పు అంకితంగా భావిస్తున్నామని జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి.. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన సందర్భాలను గుర్తుచేశారు. అసెంబ్లీలో రెండుసార్లు సభ ఏకగ్రీవ తీర్మానం చేశారని, ఈ అంశంపై కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీని కలిసిందని, ఎస్సీ వర్గీకరణ పోరులో ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబాలకు బీఆర్ఎస్ సర్కారు ఆర్థిక సాయాన్ని అందించిన విషయాన్ని గుర్తుచేశారు.

చీమలు పెట్టిన పుట్టలో జొర్రిందెవరు?

- 25 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి సేవ చేశా
- రేవంత్ ఎన్నేండ్ల నుంచి ఉన్నారు
- సీఎం సీటు దక్కగానే మహిళలపై కుసంస్కారంగా మాట్లాడతారా?
- తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): చీమలుపెట్టిన పుట్టలో పాములు జొర్రినట్టు జొర్రి పదవులు అనుభవిస్తూ కమిట్‌మెంట్‌తో పార్టీకి పని చేసిన వారిని కుసంస్కారంతో మాట్లాడడం తగదని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డి హితవు పలికారు. తాను 25 ఏండ్లపాటు కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించానని, నాడు నమోదైన సీబీఐ కేసుల చుట్టూ నేటికీ తిరుగుతున్నానని చెప్పారు. ఇదే ముఖంతో నాడు మన్మోహన్‌సింగ్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి స్వాగతం పలికి, నాడు పార్టీ చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేశానని తెలిపారు. ఆరేండ్ల క్రితం కాంగ్రెస్‌లో చేరి అదృష్టం బాగుండి సీఎం సీటు దక్కగానే మహిళలపై కుసంస్కారం ప్రదర్శిస్తారా? అని నిలదీశారు. గురువారం ఆమె ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బడ్జెట్‌పై వివరంగా మాట్లాడుతుండగా, అది ప్రజల్లోకి చేరుతుందనే భయంతో దానిని డైవర్ట్ చేయడానికి సడన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి లేచి తమపై కామెంట్ చేయడం మొదలుపెట్టారని మండిపడ్డారు. 'మీ వెనుక ఉన్న అక్కలను నమ్ముకుంటే నీకు జూబ్లీ బస్టాండే.. మమ్మల్ని ముంచారు. మిమ్మల్నీ ముంచుతారు' అనడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. సీఎం స్థాయి వ్యక్తి ఏదిపడితే అది మాట్లాడొచ్చా.. నోటికి ఎంత వస్తే అన్ని మాటలు అనొచ్చా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎవరిని మోసం చేశామో చెప్పాలని నిలదీశారు. 'నన్ను నమ్ముకొని కాంగ్రెస్ పార్టీలోకి వచ్చావ్. నీకు నష్టం జరిగిందా? నేను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను గనుకనే ఈ రోజు సీఎం కుర్చీలో కూర్చున్నావు. నాడు నీకు కాంగ్రెస్ ఎంపీ సీటు ఇస్తే నేను పార్టీ మారినవ్ అంటున్నవ్. మరి ఎందుకు నాతో కలిసి మాట్లాడలేదు. ఎందుకు ఫోన్ చేయలేదు. నా క్షేమం కోరుకొనే తమ్ముడివి అయితే, అక్కా ఎందుకు పోతున్నవ్ అని అడుగలేదు? 2014లో నాకు టికెట్ ఇవ్వకపోయినా, 2018లో నా కుమారుడికి టికెట్ ఇవ్వకపోయినా, ఒక తమ్ముడిగా నాకు సపోర్టుగా ఎందుకు ఉండలేదు' అని అని నిలదీశారు. ఐదేండ్లలో కాంగ్రెస్ వాళ్లు ఎన్ని మాటలు మాట్లాడినా, వారిని ఒక్కమాట కూడా అనలేదని గుర్తుచేశారు.

> ఈ ముఖంతోనే 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి సేవ చేశా. నమ్మకంగా పనిచేశా. పార్టీకి ద్రోహం చేయలేదు. నటించడం చేతకాదు. నేను, నా కుటుంబం పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో పనిచేశాం. ఎన్టీఆర్ ప్రభుత్వంలో నా భర్త ఇంద్రారెడ్డి హోం మంత్రిగా ఉన్నప్పుడు నాతో వచ్చేయ్.. లేదంటే మీకు మినిస్టర్ పదవి ఉండదు.. అని నాడు చంద్రబాబునాయుడు బెదిరించినా మేము వెళ్లదు. నా గురించి, నా కుటుంబం గురించి ప్రజలకు తెలుసు. -సబితాఇంద్రారెడ్డి

భట్టికి సీఎం పదవి దక్కలేదనే ఫ్రస్ట్రేషనా?

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, ఏ ముఖం పెట్టుకొని వచ్చావ్.. అంటారా? అని సబితారెడ్డి ప్రశ్నించారు. 'నాడు నేను ఒక్కదానిని పార్టీ నుంచి వెళ్లిపోయినందుకు నీ ప్రతిపక్ష హోదా పోయిందా? ఆ రోజు ఇంటికి వచ్చినప్పుడు నీ వల్లే నా ప్రతిపక్ష హోదా పోయిందని ఎందుకు చెప్పలేదు? ఐదేండ్లలో ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకొచ్చింది. అంటే నవ్వు రేవంత్‌రెడ్డిని పార్టీలోకి తీసుకొచ్చావ్. అందుకు నాకు సీఎం పదవి రాకుండా పోయిందనే ఫ్రస్టేషన్ ఆయనలో కనిపించనట్టు అర్థమవుతున్నది' అని పేర్కొన్నారు. ఒక ఆడబిడ్డను పట్టుకొని ఏ మొహం పెట్టుకొని వచ్చావ్.. అంటున్న భట్టి.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ఎక్కడి నుంచి వచ్చారని నిలదీశారు. కొందరు ఫోన్‌లో పిలువగానే కాంగ్రెస్‌లో చేరుతున్నారని, కేసీఆర్ పక్కన గట్టిగ నిలబడినందుకే ఇలా తనను టార్గెట్ చేసి అవమానపరుస్తున్నారని వాపోయారు. భట్టి.. ఏం ముఖం పెట్టుకొని వచ్చారంటే.. సీఎం రేవంత్‌రెడ్డి బల్ల చరుస్తూ రాక్షసానందం పొందారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సీటుపై కూర్చున్న రేవంత్‌రెడ్డి గౌరవంగా మాట్లాడాలని హితవుపలికారు.

> నాడు నేను ఒక్కదానిని పార్టీ నుంచి వెళ్లిపోయినందుకు నీ ప్రతిపక్ష హోదా పోయిందా? ఆ రోజు ఇంటికి వచ్చినప్పుడు నీ వల్లే నా ప్రతిపక్ష హోదా పోయిందని ఎందుకు చెప్పలేదు? ఐదేండ్లలో ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకొచ్చింది. అంటే నవ్వు రేవంత్‌రెడ్డిని పార్టీలోకి తీసుకొచ్చావ్. అందుకు నాకు సీఎం పదవి రాకుండా పోయిందనే ఫ్రస్టేషన్ భట్టిలో కనిపించనట్టు అర్థమవుతున్నది. -సబితాఇంద్రారెడ్డి

రేప్‌లపై నిలదీసినందుకే వేధిస్తున్నారా?

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు, నిత్యం మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగికదాడులపై ప్రభుత్వాన్ని నిలదీసినందుకే బాధయిందా? అందుకే ఇలా వేధిస్తున్నారా? అని సబితారెడ్డి ప్రశ్నించారు. తాను ఇదే ముఖంతోనే కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించానని, అందుకే నాడు అన్ని కార్యక్రమాలు చేవెళ్ల నుంచే ప్రారంభిస్తానని వైఎస్ అన్నారని గుర్తుచేశారు. ఆయన తనను ప్రేమగా చేవెళ్ల చెల్లెమ్మ అని పిలిచేవారని పేర్కొన్నారు. 'ఈ ముఖంతోనే 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి సేవచేశా. నమ్మకంగా పనిచేశా. పార్టీకి ద్రోహం చేయలేదు. నటించడం చేతకాదు. నేను, నా కుటుంబం పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో పనిచేశాం. ఎన్టీఆర్ ప్రభుత్వంలో నా భర్త ఇంద్రారెడ్డి హోంమంత్రిగా ఉన్నప్పుడు నాతో వచ్చేయ్.. లేదంటే మీకు మినిస్టర్ పదవి ఉండదు.. అని నాడు చంద్రబాబునాయుడు బెదిరించినా మేము వెళ్లలేదు. నా గురించి, నా కుటుంబం గురించి ప్రజలకు తెలుసు.' అని పేర్కొన్నారు. 'నా ద్వారా వైఎస్ జగన్‌ను కొట్టాలనుకున్నారు. ఇంకా నాపై ఐదు సీబీఐ కేసులు ఉన్నాయ్. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నా. ఖర్మకాలి రాజకీయాల్లో వచ్చా. ఇంద్రారెడ్డి బతికుంటే రాణిలా ఇంట్లోనే ఉండేదాన్ని. కుటుంబ ప్రతిష్ఠ తగ్గకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల కోసం పనిచేస్తున్న. పదవులు కావాలంటే టికెట్ ఇవ్వనప్పుడే బయటకు వెళ్లేదాన్ని' అని తెలిపారు.

మీరు చేసిందేమిటి?

ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారడం మోసం అయితే, మీరు చేసిందేమిటి? అని రేవంత్‌రెడ్డిని సబితారెడ్డి ప్రశ్నించారు. 'చంద్రబాబు నిన్నుపైకి తెస్తే నువ్వు అండగా ఉన్నవా? నేను ఏం మోసం చేశానో చెప్పాలి. నువ్వే నన్ను మోసం చేశావ్. నన్ను వెనక్కి రమ్మని ఎందుకు పిలువలేదు. ఫోన్‌చేసి ఎందుకు మాట్లాడలేదు. మహిళలను ఎదగకుండా అడ్డుకుంటున్నావు. మహిళలపై ఆరోపణలు చేస్తున్నావ్. అవమాన పరుస్తున్నావ్. మహిళల వివరణ కూడా వినే ధైర్యం లేదా? బిల్స్ పాస్‌చేసుకొని మీరు ఎందుకు పారిపోతున్నారు' అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రజలు అమాయకులు కాదు. అన్ని గమనిస్తూనే ఉన్నారు. సీఎం కేసీఆర్‌ను, మాజీ మంత్రులు కేటీఆర్‌ను, హరీశ్‌రావును అనరాని మాటలు అన్నారు. ఇప్పుడు మహిళలు అని కూడా చూడకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు. మహిళల పట్ల మీకున్న అవగాహన, భావజాలం ఏమిటనేది అర్థమైంది. సంస్కారం లేకుండా ఇలా ఎవరైనా మాట్లాడతారా? ఆడబిడ్డను ఎవరమైనా అమ్మా అని పిలుస్తాం.

> మహిళా ఎమ్మెల్యేలను కించపరిస్తే, అవమానిస్తే మాట్లాడరనని వారి ఉద్దేశం కావొచ్చు. కానీ, వదిలి పెట్టబోం. ప్రభుత్వాన్ని నిలదీస్తాం. మమ్మల్ని బెదిరిస్తే బెదిరిపోయేంతగా బిజినెస్‌లు ఏమీలేవు. ప్రజల తరఫున మాట్లాడుతూనే ఉంటాం. కేసీఆర్ నేతృత్వంలో పనిచేస్తాం. సీఎం చైర్‌కు గౌరవం ఉండాలంటే మాకు కాదు.. తెలంగాణ ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క క్షమాపణలు చెప్పాలి. -సబితాఇంద్రారెడ్డి

సీఎం రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపరచడం పదవికే కళంకం: నిరంజన్‌రెడ్డి



వనపర్తి, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : శాసనసభలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష ఆయన పదవికే కళంకమని, ముఖ్యమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'నీకంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉండి.. మంత్రులుగా పని చేసిన మహిళలపై అడ్డగోలుగా మాట్లాడటం తగదు' అని అన్నారు. తొలిరోజు నుంచే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా మాట్లాడలేదని, నిజాలు మాట్లాడితే తట్టుకోలేక, అహంకారంతో వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు.